రోడ్డంతా సంత.. తీరదు చింత!



నవాబ్‌పేట సంతకు వచ్చిన జనంతో కిక్కిరిసిపోయిన రహదారి

- నవాబ్‌పేటలో రోడ్డుకిరువైపులా విక్రయాలు
- మూడు కిలోమీటర్ల మేర కిక్కిరిసిన జనం
- సంత దాటాలంటే సాయంత్రం వరకు ఆగాల్సిందే..

నవాబ్‌పేట: నవాబ్‌పేట సంత అంటేనే రోడ్డుతో చింత అనే విషయం గుర్తుకు వస్తుంది. ఆదివారం వచ్చిందంటే చాలు నవాబ్‌పేట మండల కేంద్రం నుంచి వెళ్లేదారులన్నీ దాదాపుగా 6గంటలు అప్రకటిత బంద్‌ల ఉంటాయి. వేలాది మంది జనం కనీసం నడవడానికి రానంతగా దాదాపు 3కిలోమీటర్ల పొడవులో సంత జరుగుతోంది. సంత దాటి అవతలి గ్రామాలకు వెళ్లాలంటే ఆదివారం సాయంత్రం 6గంటల తర్వాతనే వెళ్లాల్సి వస్తోంది. జనం జాతర మాదిరిగా దాదాపు మూడు నాలుగువేల మంది ఈ సంతకు వస్తుండడంతో ఆదివారం మండల కేంద్రం జనంతో కిక్కిరిసిపోతుంది. మండల కేంద్రం చుట్టూ చాలా పల్లెలు ఉండడం.. అలాగే చుట్టుపక్కల గ్రామాలతో పోలిస్తే పెద్ద సంత కావడంతో అన్నిరకాల వస్తువులు ఈ సంతలో లభిస్తుండడంతో సంతకు జనం జాతరలా తరలి వస్తారు. కాని ఈ సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం మూత్రశాలలు సైతం లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రధానంగా మహిళలు ఎక్కువగా ఈ సంతకు రావడంతో వారికి ఇబ్బందులు చాలా ఎక్కువ. ఈ విషయంలో అధికారులు స్పందించి సంతకు వచ్చే వారికోసం కనీస సౌకర్యాలైన మూత్రశాలలు, తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉంది.



నవాబ్‌పేట సంతలో రోడ్డుకు ఇరువైపులా కూరగాయల విక్రయాలు(వ్యూ)

రోడ్డు సమస్య తీవ్రం

నవాబ్‌పేట సంత జరిగే ఆదివారం దాదాపు మూడు కిలో మీటర్లకు పైగా సంత ఉంటుంది. కాని అటువైపు ఉన్నా.. లోకిరేవు, లింగంపల్లి, రేకులచౌడాపూర్, కాకర్‌జాల్, తండాలకు 4గ్రామాలకు దారి మూసుకుపోతుంది. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా ఈ దారి కనీసం నడవడానికి సైతం ఇబ్బందిగా ఉంటుంది. ఆ గ్రామాలకు వెళ్లాలన్న వారు తమ వాహనాలతో 6 గంటల దాకా వేచి చూడాల్సిందే. ఈ విషయంలో సంతకు బైపాస్ దారిని త్వరలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

రోడ్డు సమస్యపై అధికారులకు సూచించాం

సంతకు వచ్చే జనంతో రోడ్డు జామ్ అవుతోంది. ఈ విషయంలో రోడ్డు సమస్యకు పరిష్కారం చూసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు వివరించాం. గతంలో సర్పంచులు పదవిలో ఉన్నప్పుడు రోడ్డు విషయంలో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కాని తాజాగా సంతకు వచ్చే వారి సంఖ్య వారంవారం పెరుగుతున్న దృష్ట్యా దీనిపై అధికారులకు వివరించి చర్యలు తీసుకునేలా చూస్తాం.

– నరేశ్, పంచాయతీ అధికారి, నవాబ్‌పేట

క్లుప్తంగా

నోటు బుక్కుల పంపిణీ

జడ్చర్ల టౌన్: మండలంలోని కొండేడ్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 50మంది విద్యార్థులకు సోమవారం కొంగళి శ్రీకాంత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. నోట్‌పుస్తకాలతోపాటు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



నవాబ్‌పేట: మండలంలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన యువకుడు చేయూతనిచ్చాడు. సాయినాథ్‌యాదవ్ అనే యువకుడు పాఠశాలలో చదివే 1, 2 తరగతుల విద్యార్థులకు పలకలు, బొమ్మల పుస్తకాలు, నోట్‌బుక్స్, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, నోట్‌బుక్కులు అందజేశాడు. అలాగే అంగన్‌వాడి చిన్నారులకు పలకలతోపాటు పలు రకాల బొమ్మలు అందించాడు. యువకుడి చేయూతను ఎంఈఓ నాగ్యానాయక్, గ్రామస్తులు నాయబ్, బాబ, యాదయ్య, బాలకిష్టయ్య, తిరుపతయ్య, విష్ణు, గౌస్ తదితరులు పాల్గొని అభినందించారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పరుస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: లయన్స్ క్లబ్ సేవలను మరింతగా విస్తృత పరుస్తామని నూతన లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రం ఏనుగొండలోని లయన్స్ భవన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూరు కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా రామ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ బాబుల్‌రెడ్డి, కోశాధికారిగా విజయ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్ చిన్నకిషన్‌రెడ్డి, లయన్ నటరాజ్, లయన్ శశికాంత్, రీజియన్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, జోనల్ చైర్మన్ ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొని డీసీఎం బోల్తా



జడ్చర్ల: మండలంలోని మాచారం సమీపంలో ట్రావెల్ బస్సును డీసీఎం ఢీకొని బోల్తాపడిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా.. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఎదురుగా జడ్చర్ల వైపు వస్తున్న డీసీఎం ఢీ కొట్టి రహదారిపై బోల్తాపడింది. దీంతో రాకాపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. పోలీసులు స్పందించి డీసీఎంను పక్కకు తప్పించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కాగా డీసీఎం రోడ్డు డివైడర్‌ను దాటి వచ్చి బస్సును ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఎవరికీ ఏమి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

భగవద్గీత మార్గదర్శి

నవాబ్‌పేట: భగవద్గీత మానవాళికి మార్గదర్శిలా ఉంటుందని అందులో చెప్పిన ప్రతివాక్యం ఆదర్శం, ఆచరణీయమని ఎంపీడీఓ జయరాంనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో హనుమాన్ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ విగ్రహం చెంత గ్రామస్తులు, మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి ప్రశాంతంగా ఉండాలంటే భక్తి చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జ్యోతి, మండల నాయకులు సత్యం, నీలకంఠ, కేశవులు, గోపాల్, ఆంజనేయులు, ఆనంద్, పెంటయ్య, పాండు, వెంకటయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంఖ్య పెంచాలి

మహమ్మదాబాద్: అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్యను పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం మొదట్లో బడిఈడు కల్గిన చిన్నారులందరినీ అంగన్‌వాడీల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా అందించాలన్నారు.

పరిశుభ్రత పాటించాలి

నవాబ్‌పేట: వర్షాకాలం నేపథ్యంలో అందరూ పారిశుద్ధ్య చర్యలపై దృష్టిసారించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు.కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ నసీరొద్దీన్, ఏపీఓ జ్యోతి, పంచాయతీ అధికారి నరేశ్, రాజేశ్, వెంకటయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యకు అధిక ప్రాధాన్యత



భూత్పూర్ రోడ్డులో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ఒకేషనల్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థి సాయికుమార్‌కు రూ.25వేలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో డీఐఈఓ కౌసర్‌జహాన్, ప్రిన్సిపాల్ నర్సింహులు, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మొత్తం రూ.3.20 కోట్లతో క్రిస్టియన్‌పల్లిలోని బుద్ధ విగ్రహం నుంచి భూత్పూర్ మెయిన్ రోడ్డు వరకు, కొత్తగంజ్‌లోని పోచమ్మ ఆలయం నుంచి టీడీగుట్ట మెయిన్ రోడ్డు వరకు సీసీ, తెలంగాణ చౌరస్తా నుంచి కోర్టు రోడ్డు వరకు నిర్మించే బీటీ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు వేపురిగేరిలో దెబ్బతిన్న పెద్ద నాలాను పరిశీలించారు. దీని నుంచి వచ్చే దుర్వాసనను అరికట్టడానికి వెంటనే మరమ్మతు చేపట్టాలని, అవసరమైతే పిల్లర్లు, స్లాబ్ వేసి నడక దారి ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్‌వరల్డ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి చర్యలు

పాలమూరు: సీఎం చేతులమీదుగా నూతన కోర్టు నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్కింగ్ స్థల షెడ్డు విస్తరణతో పాటు మహిళా న్యాయవాదుల వసతికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని తెలిపారు. బండమీదిపల్లి సమీపంలో జిల్లా కోర్టు భవన నిర్మాణ పనుల విషయం హైకోర్టు పర్యవేక్షణలో కొనసాగుతుందన్నారు. పనులు ప్రారంభం చేసుకోవడానికి సీఎంను ఆహ్వానించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉచితంగా డేటా ఇంజినీరింగ్ కోర్సు



స్టేషన్ మహబూబ్‌నగర్: సత్యసాయి సేవా సంస్థ నిరుద్యోగ యువత కోసం శ్రీసత్యసాయి స్కి డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత డేటా ఇంజినీర్ కోర్సును అందిస్తోందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు 2022–2025 మధ్య బీఎస్‌సీ, ఎంఎస్‌సీ, బీటెక్, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు sethu.ai నమోదు చేసుకోవచ్చు లేదా 90523 72023 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్ అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, బీఎల్ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. తరగతులు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందిస్తారని తెలిపారు.

ఫొటో కచ్చితంగా వాడాలి..

‘బీసీలను మోసం చేసిన బీజేపీ’

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ అభ్యర్థికి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వకుండా అగ్రకుల వ్యక్తికి ఇచ్చి బీసీలను మోసం చేసిందని బీసీ జేఏసీ జిల్లా నాయకులు మైత్రి యాదయ్య సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. బీసీకి అధ్యక్ష పదవి ఇస్తామని నమ్మించి మోసం చేశారని తెలిపారు. వచ్చేఎన్నికల్లో బీజేపీ బీసీ సత్తా ఎలా ఉంటుదో చూపిస్తామని పేర్కొన్నారు. 42శాతం రిజర్వేషన్ గురించి మోడీతో మాట్లాడడం లేదని, రెండు రోజుల్లో ఈడబ్ల్యూఎస్ బిల్లు ప్రవేశ పెట్టి పాస్ చేయించిన బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. బీసీల ఓట్లు బీజేపీ అవసం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి పాస్ చేయించాలని అందుకు రాష్ట్ర బీజేపీ నాయకత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా మాక్ పోలింగ్

- ఆసక్తి చూపిన గురుకులం విద్యార్థినులు
- ఎన్నికల ప్రక్రియపై అవగాహన

జడ్చర్ల టౌన్: విద్యార్థుల్లో ప్రజాస్వామ్యం, భారతీయ ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం మాదిరి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యా క్యాలెండర్ ప్రకారం మాదిరి ఎన్నికలు ఒక కార్యక్రమంగా ఉంటుందని ప్రిన్సిపాల్ అనిత తెలియజేశారు. అందులో భాగంగానే నిర్వహించిన ఎన్నికల్లో విద్యార్థినులకు ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన కల్పించామన్నారు. ఓటరు జాబితా నమోదు, జాబితా విడుదల, ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, తుది జాబితా విడుదల చేయడంతోపాటు పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి ఓటరు కార్డు ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే విధానాన్ని క్షుణ్ణంగా ప్రదర్శన ద్వారా తెలియజేశామని తెలిపారు. తద్వారా క్రమశిక్షణతో కూడిన రాజకీయ విలువలను పరిచయం చేశామన్నారు. మాదిరి ఎన్నికలను వైస్ ప్రిన్సిపాల్‌విద్యావతి, ఉపాధ్యాయులు శ్రీరంగ రాజేశ్వరి, సాంఘిక శాస్త్ర బృందం పర్యవేక్షించింది.



మాదిరి ఎన్నికల్లో ఓటు వేసేందుకు చూపుడు వేలుపై సిరా వేయించుకుంటున్న విద్యార్థి ఓటరు

ఉద్యోగ విరమణ తప్పనిసరి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని కలెక్టర్ విజయేందిర అన్నారు. పదవి విరమణ చేసిన అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావుకు కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌శివేంద్ర ప్రతాప్, గద్వాల అడిషనల్‌కలెక్టర్ లక్ష్మీనారాయణ, జెడ్పీ సీఈఓ వెంకట్‌ఎడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, టీజీఓ జిల్లాఅధ్యక్షుడు విజయ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

దేవరకద్ర: విద్యార్థి దశలో ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదువు సంస్కారాన్ని అలవర్చుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీజీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ అన్నారు. సోమవారం దేవరకద్ర జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైజయంతి, జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, ప్రతినిధులు రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో అధికారుల నిలదీత

మిడ్జిల్: 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోమ వారం మండల పరిషత్ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు 14వ విడత సామాజిక తనిఖీ చర్యలు, రికవరీ వివరించిన తర్వాత 15 విడత సామాజిక తనిఖీ నిర్వహించాలని అధికారులను నిలదీశారు. గత సామాజిక తనిఖీ రికవరీ వివరాలు తమవద్ద లేవని అధికారులు తెలపగా, అవి తెప్పించిన తర్వాతే నిర్వహించాలని పట్టుబట్టగా.. అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో రికార్డు లు కావాలని కోరగా.. పీడీ కార్యాలయంలో ఉన్నా యని సమాధానం చేప్పే ప్రయత్నం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న రికార్డులను తెచ్చి అధికారులకు ఇవ్వగా..వారు సమాధానం చెప్పలేక పోవడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు. రెండు, మూడు గ్రామాల వివరాలు చదివి రేపటికి వాయిదా వేశారు.సమావేశంలో ఏపీడీ శృతి, ముషా యిదా బేగం, ఎంపీడీఓ గీతాంజలి పాల్గొన్నారు.

ఏఎంసీగా అజ్మీర రాజన్న

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఏఎంసీగా అజ్మీర రాజన్న పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పవణ్‌కుమార్ పదోన్నతిపై ఈనెల 23న ముడుచింతలపల్లికి బదిలీ కాగా.. భూపాలపల్లికి చెందిన కొత్త ఏఎంసీ రాజన్న గతంలో 12ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2019లో గ్రూప్–2లో విజయం సాధించి సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ)గా విధులు నిర్వర్తించారు.తాజాగా పదోన్నతి (గ్రేడ్–2)పై మహబూబ్‌నగర్‌కు వచ్చారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరిశ్చందర్‌రెడ్డి

గండీడ్: ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరిశ్చందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఎంపీడీఓగా పనిచేస్తున్న దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఇక్కడున్న ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి మహమ్మదాబాద్ మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్నాడు. గండీడ్‌కు కోయిల్‌కొండ మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హరిశ్చందర్‌రెడ్డిని నియమిస్తూ సీఈఓ వెంకట్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

కవర్ స్లాబ్‌ల నిర్మాణం పరిశీలన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలో మురుగుకాల్వలపై నిర్మిస్తున్న కవర్ స్లాబ్‌ల పనులను సోమవారం చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పరిశీలించారు. సంజీవయ్య కాలనీ పోస్ట్ ఆఫీస్ వెనకాల జరుగుతున్న పనులను సందర్శించారు.ప్రజలకు ఇబ్బంది కలగకుండా కాల్వలపై నిర్మిస్తున్నామని ఆమె వెల్లడించారు. ఒక్కోచోట కవర్‌స్లాబ్ నిర్మాణానికి రూ.2లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. పదవీ విరమణ తర్వాత శేషజీవితం పూర్తిగా కుటుంబ సభ్యులకు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సూచించారు. మున్సిపాలిటీలో పదవి విరమణ పొందుతున్న బిల్ కలెక్టర్ ఆంజనేయులు, ఆఫీస్ సబార్డినేట్ తిరుపతమ్మను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: కాంగ్రెస్ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రభుత్వం సర్కారు బడుల బలోపేతానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేట జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జరిగిన గజిటెడ్ హెచ్‌ఎం గోపాల్‌రాజు పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. గోపాల్ రాజు దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం జానంపేటలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారురాలు మ్యాదరి లింగమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఎంఈఓలు రాజేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: సీఎం సహాయనిధి కింద బస్వాయపల్లికి చెందిన కమ్మరి కోటేశ్వరాచారీకి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని శివాలయం అభివృద్ధికి ప్రభుత్వం రూ.50లక్షలను మంజూరు చేసింది. ఇటీవల గ్రామస్తులు శివాలయం పునర్నిర్మాణానికి 20శాతం ప్రత్యేక సహకారాన్ని గ్రామస్తులు దేవాదాయశాఖకు చెల్లించారు. దీంతో దేవాదాయశాఖ ద్వారా ఆలయ పునర్నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు కావడంతో ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాన్ని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సోమవారం గ్రామస్తులకు అందజేశారు. పురావస్తుశాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించి అంచనాలు సిద్ధం చేసిన తర్వాత టెండర్ ప్రక్రియను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, యాదయ్య, నర్సింహాశర్మ, రాములుయాదవ్, రవికాంత్‌రెడ్డి, మహేందర్, శ్రీకాంత్, మహేశ్, శ్రీనివాస్, సాయి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ మోసం’



భూత్పూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

భూత్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిరసన తెలిపిన అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయ వద్దకు వెళ్లి తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, మండలాధ్యక్షుడు శ్రీను, పట్టణ అధ్యక్షుడు నర్సింహ, నరేషాచారి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు కుర్వరమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఎన్నో హామీలిచ్చి వాటిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో దశరథ్, నరేందర్‌జీ, రాము, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం చేరుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యజ్ఞభూపాల్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి దేవన్నసాగర్, మండలాధ్యక్షుడు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కౌకుంట్లలో బీజేపీ ధర్నా

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అంతనం తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బోయ రమేశ్, గట్టు మల్లేశ్, సుధాకర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, చెన్నగౌడ్, హరికృష్ణ, శివ, శ్రీను, సుందరయ్య, బుచ్చన్న ఉన్నారు.

పొరపాటున తెచ్చిన బ్యాగు అందజేత

జడ్చర్ల టౌన్: ఓ ప్రయాణికురాలు పొరపాటున మరొకరి బ్యాగు తేవడంతో గుర్తించిన ఆర్టీసీ అధికారులు ఆమె నుంచి తీసుకుని వెనక్కి పంపించిన ఘటన సోమవారం జడ్చర్ల బస్టాండ్‌లో చోటుచేసుకుంది. కొల్లాపూర్ నియోజకవర్గం వల్లభాపురం గ్రామానికి చెందిన శంకరమ్మ కొమురవెల్లి మల్లన్న దర్శనం చేసుకుని సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వచ్చింది. బస్సు దిగే సమయంలో మరొకరి బ్యాగు తీసుకుంది. బ్యాగు తీసుకుని కొల్లాపూర్ బస్సు ఎక్కింది. అప్పటికే తన బ్యాగు తప్పిపోయిందని గుర్తించిన ప్రయాణికురాలు హైదరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న అధికారులు సీసీ కెమెరాను పరిశీలించగా.. కొమురవెల్లి నుంచి వచ్చిన వృద్ధ ప్రయాణికురాలు బ్యాగుతో కొల్లాపూర్ బస్సు ఎక్కడం గుర్తించారు. వెంటనే ఆమె వివరాలు, సీసీ కెమెరా దృశ్యాలు, బస్సు వివరాలను జడ్చర్ల ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో బస్సు నెంబరు ఆధారంగా బస్టాండ్‌కు చేరుకున్న బస్సులో వృద్ధురాలిని గుర్తించి ఆరా తీశారు. బ్యాగును పొరపాటుగా తీసుకొచ్చానని వారికి అప్పగించింది. బ్యాగులో రూ.9వేల నగదుతోపాటు ఇతర కొన్ని విలువైన పత్రాలు ఉన్నట్లు బాధిత ప్రయాణికురాలు అధికారులకు తెలిపింది. అన్ని సక్రమంగా ఉండడంతో బ్యాగును మరో బస్సులో హైదరాబాద్ బస్టాండ్‌కు చేరవేయగా అక్కడి అధికారులు ప్రయాణికురాలికి అందించినట్లు స్టేషన్ మాస్టర్ యాదగిరి, ట్రాఫిక్ గైడ్స్ వెంకటయ్య, శివరాములు, ఆర్టీసీ సెక్యూరిటీ నర్సింహులు తెలిపారు.



ప్రయాణికురాలి వద్ద బ్యాగును తీసుకుంటున్న ఆర్టీసీ అధికారులు